# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాంమధు.

సంపుటము ౮. సంచిక ౪౯. | కాకినాడ:—శనివారము, డిశంబరు, 10 ౧౦, ౧౯౨౧. | చందా సం॥ రు 3. విడిసంచిక అ ౧.

## ఓమ్.

నీవు ఒక్కడవయ్యు బహు విధములుగా విచిత్ర వర్ణములతో ప్రకాశించుచున్నావు ఏకమేవా ద్వితీయుడవగు నిన్ను సకల విజ్ఞాన శాస్త్రములును సకల దర్శన శాస్త్రములును అన్వేషణము చేయుచున్నవి. మనుష్యుడు ద్వైతభావముతో సంతుష్టుడై యుండనేరడు. సకల వైరుధ్యములను సకల వైచిత్ర్యములను సమన్వయము చేసెడు సూత్రము కొరకై అతడు ఎదురు చూచుచున్నాడు. పరివర్తనముల జెందెడు నీ వస్తుజాలము మధ్య నీవు ఒక్కడవే. అపరివర్తనీయుడవు. వికారములలో నీవు నిర్వికారుడవు. కాలబద్ధములైన వస్తువులలో నీవు కాలాతీతుడవు. క్షణ భంగురము లయిన పదార్థములలో నీవు నిత్యుడవు, నూతన నిత్య వస్తువులలో నీవు పురాతనుడవు. మరణ శీలమైన వస్తువులలో నీవు అమృతుడవు. నశ్వర పదార్థములలో నీవు అనశ్వరుడవు ఎవ్విధమున జూచినను పరస్పర విరుద్ధ భావములను నీవు సమన్వయము చేయువాడవు. నీవు నామముగాని, రూపముగాని, ఉపాధిగాని లేనట్టి నిరవచ్ఛిన్న సత్తామాత్రుడవు గావు. నీవు చైతన్యమయ పురుషుడవు. కాని సకల నామములను సకల రూపములను సకల ఉపాధులును నీకు ప్రయోగింప జెల్లును. నీవు ప్రాకృతిక జగత్తునందలి తాపము నందు, వెలుతురునందు, మెఱుపునందు ఒకే శక్తిగా నెట్లు ప్రకాశించుచున్నావో, అట్లే చల్లదనము, వేడిమి, చీకటి, వెలుగు మొదలైన మార్పులలోను నీవు ఒకటే విధమున ప్రకాశించుచున్నావు. ఇక మనోజగత్తునందలి సుఖ దుఃఖములందును, ఆశాభయములందును, పాప పుణ్యములందును, ప్రేమానూయలందును నీ మంగళేచ్ఛయే వ్యక్తమగుచున్నది. మేము నీచములని, మంచిచెడుగులని, న్యాయాన్యాయములని, సత్యాసత్యములని విభాగము చేసెడు సకల కార్యములందును నీవే ప్రకాశించుచున్నావు. సీమాతీతుడవగు నీలో నేను మునిగిపోయి దేశ కాలాతీత రాజ్యమున వసించునపుడు నిందనీయమైనది యేమియు గనబడ జాలదు.

(అనువాదము) వా, న.

---

## రండు! సోదరి, సోదరుల్ !!

రండు సోదరి సోదరుల్ రక్షకుండు
ప్రేమ సందేశమును బంపె భీతియేల ?
శుష్కి నిడుకొని లోకము దక్షతముడు
ఏలుచున్నాడు నాయన కొలువునందు
జాగరూకతతో నుండ జనును మనకు
ధర్మ సమరము ప్రబలిన ధరణియందు
శాంతి సత్యములను గల్గి వంతవిడచి
చెంత దుర్గుణ గణముల జేర్చకుండ
సర్వ సంస్థవసీము సద్వర్తనంబు
తో మెలంగుట మిక్కిలి క్షేమకరము.

వే. వెం.

---

# ఎక్కువవారు—తక్కువవారు.

—:o:—

I

(శ్రీ జనమంచి సీతారామస్వామిగారు.)

"శ్లో॥ వ్యాధస్యాచరణం, ధ్రువస్య చవయో, విద్యా గజేంద్రస్య కా
కుబ్జాయాః కిము నామరూప మధికం, కింవా సుదామ్నో ధనం
వంశః కోవిదురస్య, యాదవపతే రుగ్రస్య కిం పౌరుషం
భక్త్యాతుష్యతి కేవలం నచగుణైర్భక్తి ప్రియో మాధవః."

ఈ శ్లోకరాజ మెన్నిసారులు చదివిన దనివి కలుగును? మే మెక్కువవారము, వారు తక్కువవారలు నను భేదబుద్ధి గుదుర్పుట కిది యమోఘౌషధమని నాకు దోచుచున్నది. కాని, నేనే పొరపడుచున్నానేమో? ఏల యనగా లోకములోని యధర్మపరాయణత్వమునకు హేతువు సదుపదేశము లేకపోవుటయా? సద్గ్రంథములకు గఱవు పట్టలేదు. సద్బోధకులు లేకపోలేదు. సత్క్రియలకు లోపము లేదు. స్థిరచిత్తమే యరుదయ్యెను. ఎఱిగియుండియే గోతిలో బడు వారనేకులు గలరు.

"ఉ. చెప్పిరి నీతివాక్యము లశేషముగా మన పుస్తకంబులన్;
జెప్పిన వెల్ల వల్లనము చేసితి; నాచరణంబు మాత్రమే
చొప్పడకుండె; నీవిధుల చొప్పున నెప్పుడుజేయ, నామదిం
ద్రిప్పి కృపారసంబు ప్రసరింపగ జేయవె భక్తవత్సలా."

యని, యనుతాపానల సంతప్త హృదయులై పరమేశ్వరుని బ్రార్థింపవలసిన వారు కోటానగోట్లు. (వారిలో నేనుగూడ నొకడను గాకపోలేదు) అనంత కల్యాణ గుణ పరిపూర్ణుడగు పరమ పురుషుని దృష్టిలో నందఱు సమానులనియు, నమ్మహానీయునిచే సృజింపబడిన మానవకోటిలో గొందఱను కులము బట్టి యగౌరవార్హులనుగా భావించుట దోషమనియు, సత్ప్రవర్తనము ప్రశంసనీయమైనట్లు మఱేదియు గాదనియు బోధింపని మతము లేదు. కాని దురభిమానము మనస్సును జెఱచి దుర్నయ మొనరించుటకు బురికొల్పును. అది విడిచిపెట్టునంత కాలము, దేశాభివృద్ధి కానేరదని నా నిశ్చితాభిప్రాయము.

"బ్రాహ్మణుడా, మాలవాడా? ధనవంతుడా, దరిద్రుడా? వృద్ధుడా, బాలుడా? సుందరుడా, కురూపియా? విద్యావంతుడా, నిరక్షరకుక్షియా?" యని యడుగక, "సత్యదయాశౌచములు కలవాడా, కాడా?" యను ప్రశ్నమునకు మాత్రము సమాధానము గోరి, ఆ ప్రత్యుత్తరము తృప్తికరముగా నున్నప్పుడే, భగవంతుడు మానవునకు "భక్త" డను బిరుదము నొసంగును. అట్టి భక్తులే నిజముగా 'ఎక్కువ' వారు. తక్కినవారు 'తక్కువ' వారు. సర్వేశ్వరుని యందు భక్తిగలిగి యుండుట యనగా సకల మానవాళి యందు బ్రేమగలిగి యుండుట యనియే యర్థము. "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకం" అను వాక్యము సర్వ సహృదయ సమ్మతము. ఇందులకు దార్కాణము రంతిదేవుని పవిత్ర చరిత్ర యని చెప్పనొప్పు.

ఆ రాజేంద్రుడు పరమభక్తుడు, మహాదాత, సర్వజనానురాగి. అతడు తన సంచితార్థములన్నియు బేదసాదల కొసంగి "సకుటుంబుడై ధైర్యసంయుతుండై పేదయై కూడు నీరు లేక" నలుబది యెనిమిది దినములు చరించెను. ఒకనాడు నెయ్యి, పాయసము, జలము గలుగగా నతడు తన యపరిమిత క్షుత్పిపాసాబాధ నివారించుకొన దలచుచుండె. అంత నొక్క బ్రాహ్మణుడు వచ్చి యాహారమడిగెను. రాజతని గౌరవించి యన్నములో సగమిచ్చెను. భూసురుడది భుజియించి వెడలిపోవునంతలో నొక శూద్రుడతిథియై యేతెంచెను. రంతిదేవుడు వానిని గూడ గౌరవించి మిగిలిన యన్నములో నొక భాగము దయచేసెను. ఆశూద్రుడేగిన వెనుక నింకొకడు వచ్చి, యన్న శేషమును బడసి తన దారిని దా బోయెను. భూపతి గ్రుక్కెడు మంచినీరైనను ద్రాగి తాప ముపశమింప జేసికొన బోవుచుండగా, నొక్క చండాలు డరుదెంచి 'అయ్యా, నే నొక మాలవాడను. దప్పిగొని చచ్చిపోవుచున్నాను. కొంచెము నీరు పోసి నన్ను రక్షింపవే' యని వేడుకొనెను. అప్పుడు రాజు 'పో, పో, దగ్గరకు రాకు. మాలముండకొడుకా' యని కసరివేయక, కరుణార్ద్రహృదయుడై సాదరంబుగ 'రావన్నా, ఇదిగో మంచినీరు కొంచెమున్నది. త్రాగుము' ని జలమును పోసెను.

"ఉ. అన్నము లేదు; కొన్ని మధురాంబువు లున్నవి త్రావవన్న, రా
వన్న, శరీరధారుల కాపదవచ్చిన, వారి యాపదల్
గ్రన్నన దీర్చి వారికి సుఖంబులు సేయుటకంటె నొండు మే
లున్నదె? నాకు దిక్కు పురుషోత్తము డొక్కడె సుమ్మి పుల్కసా."

—

# దుష్పరిపాలనము.

—:o:-:o:—

(శ్రీ ఉమర్ అలీషా కవిగారు.)

అజందేశపు రాజులలో బలిష్ఠుడైన వాడని కీర్తిగాంచిన "బూజాయెల్" అను భూపాలుడు ప్రజలను పీడించి ధనము సంపాదింపవలయునని పెక్కు మార్గముల పన్ని మితిమీరిన పన్నులచే జనులను గ్రుంగించుచుండెను. వాని దౌర్జన్యములకు కుతంత్రములకు పాలితులు పడరాని బాధలు పడి ఆ క్షోభను భరింపలేక భయపడి దేశాంతరులై పారిపోవనారంభించిరి. ఇట్లు క్రమముగా జనక్షీణమైన రాజ్యమున రాబడి తగ్గిపోయినది. ఏకోశమున వెదకినను ధనలేశము లేదయ్యెను. ఈసంగతి శత్రురాజులకు తెలిసి దండెత్తి వచ్చు ప్రయత్నములు జరుగుచుండెను. కాని యాదురాత్ముడు తన పని మానలేదు. వాని దినము లానందముగ గడచుచుండెను.

ఉ॥ భూపతియై వినోదములం బుచ్చెను వాఁడు దరిద్రులార్తులై
యాపదలన్ శరణ్య మిడ నార్చిన; వారిని గావఁడేని యా
కాపురుషున్ ద్యజించెదరు కావున నేవఁడైన పేర్మునున్
జూపనిచో ప్రభున్ విడువఁ జూచు; నవజ్ఞతఁ జెల్ల దేరికిన్.

ఒకనాడు వాని పేరోలగంబున 'షానామం' అను ఈరాన్ దేశ చక్రవర్తుల చరిత్రము (భారతము వంటి పురాణము) చదువుచుండిరి. అందొక కథలో ఈరాన్ దేశ మేకచ్ఛత్రముగా నేలిన జోహాకునకు' రాజ్యము పోయి 'ఫరీదూన్' అను సామాన్యపు మనుష్యునకు వచ్చుట విని,

రాజు — ఈ ఫరీదూనునకు ధనము, దేశము, సేన, గౌరవము, పలుకుబడి లేదు గదా! ఎట్లాతని కంత యఖండ రాజ్యలక్ష్మి లభించినది. అది యేమి కారణము. ఇది సంభవమేనా! అని మంత్రి నడిగెను.

మంత్రి — నీ వడిగిన దాని కుత్తరు వందు లిఖింపబడియే యున్నది గదా! నేను వేఱుగ చెప్పున దేమున్నది? ప్రజలందరు నిలా ఫరీదుని వెంట పోగుపడి సాయ మొనరించిరి. వాని పక్షమున వారెల్లరు కృతజ్ఞులై యుండిరి. కావున నత డనాయాసముగా విజయమును గాంచగలిగెను.

రాజు — బాగు బాగు ప్రజాహిత మెంతపనినైన నేయున నుటలో నతిశయోక్తి లేదు.

మంత్రి — రాజా! ప్రజాక్షేమమే రాజ్య కారణమైనచో వారి నేల యారీతిగా పీడించుచున్నావు? నీవు మరి యీ రాజ్యము నిలుపనెంచుకొన లేదా?

కం॥ సైన్యము ప్రాణమువలె సా
జన్యత కాపాడవలయు జగదీశ్వరుఁడున్
సైన్యముచే రాజ్యము సా
మాన్యముగా నేలు గుణ సమన్వితుఁ డగుచున్.

రాజు — సైన్యము, ప్రజలు, పరివారము, విశేషముగా సమకూర్చుటకు వారు ప్రోగుపడుట కేమేమి పరికరములు కావలసి యుండును?

మంత్రి — ప్రజలు సమకూడి సహాయులగుటకు వితరణము, తన సామ్రాజ్యమున తాను నిర్భయముగా నివసించుటకు అఖండమైన దయారసమును కావలసియుండును. కాని అవి రెండు నీ యందు కానరాలేదు.

తే॥ గీ॥ ఏ నృపాలుఁడు ప్రజల హింసించు నొక్క
వాఁడు కొన్ని నాళ్లకె పద భ్రష్టుఁడగును
ఖలులు రాజ్యంబు దేశంబు గాయ లేరు
మేకలను మేపఁ జాలవు మెకము లెపుడు.

తే॥ గీ॥ ధరణి యొకరిది గాదు తథ్యంబు గాని
దాని పోఁగొట్టు వారలు ధర్మ మార్గ
మును త్యజింతురు కావున పోవుచుండు
అంత్య దశకది సంప్రాప్త మగుచు నుండు.

తే॥ గీ॥ పరిజనము నేయు చుండును పాపములను
వారి పక్షాన బోవు భూపాలుఁ డతని
నెత్తిపై పాప భారంబు నెత్తఁ బడును
అదియె సామ్రాజ్యపు పునాది నాశ మొందు.

రాజు — మంత్రి వచనముల కాగ్రహ ఉద్దహ్యమానుడై మండిపడి వెంటనే వానిని చెఱసాలకు బంపించెను గాని కొన్ని నాళ్ల తరువాత వాని దాయాదులు వచ్చి తమకు రావలసిన భాగము పంచి యిమ్మని కోరినారు. వారి వెన్నాడి గొప్ప సేన యుండెను. వారందరు ఈ రాజుచే పీడింపబడిన ప్రజలు. తుద కతనిని బంధించి వాని రాజ్య మంతయు నాక్రమించిరి. అంతటితో వాని దౌర్జన్య పురాణమునకు ప్రకృతియే స్వస్తి పాట పాడినది.

సీ॥ ఏ నృపాలుఁడు సెన రించుక నేయక
ప్రజలను పీడింపఁ బోలు పనునో
వాని విపత్కాల వాసరంబున వారు
ప్రబల విరోధులై పరగ వింత్రి
పరి జనంబుల తోడ ప్రజలతో నమకూల
వర్తనుఁ డైన భూపాల మణికి
పగతురచే గాని పగలచేతను గాని
వంచనంబును రాదు భయము లేదు

తే॥ గీ॥ ధరణి పరిపాలనా దురంధరుఁడు సుజనుఁ
డైన నృపునకు ప్రజలె సైన్యంబు గాన
దెలిసి దీనుల గావ జింతింప వలయు
కాల పతనంబునకు భీతి గాంచి యైన.

తే॥ గీ॥ ఎన్ని రాజ్యముల్ ధరణిపై యేల లేదు
వార లున్నారె ధర్మంబు వలన వారి
పేరు చిరకాల మున్న దీ పృథ్వియందు
ధర్మ హీనుఁడు చెడు నతి త్వరిత గతిని.

(సాది అనువాదము)

---

తామ్రపత్రములకు బహుమానము:—

"తామ్రపత్రముల లోహము యొక్క ధర చాల స్వల్పము. కాని వాని యొక్క చారిత్రక విలువ మాత్రము విశేషముగ నుండును. కొంతమంది వ్యక్తుల స్వార్థ పరత్వమువలనను అజాగరూకత వలన విద్యావంతులకు ఆశాసనములలోని చారిత్రక విషయము తెలిసికొను భాగ్యము లేకపోవుట చాల విచారకరము. ఇట్టి శాసనములు గల వారి యందును పురాతన వస్తు పరిశోధక శాఖవారి యందును పరస్పర సహకారము పెంపొందింప జేయుటకు గాను ఇకమీదట పురాతన తామ్రపత్రముల దెచ్చిన వారికి మంచి బహుమతులు ప్రభుత్వము వారీయదలచిరి. ఇట్లు గ్రహించిన తామ్రపత్రములను సురక్షితముగ గాపాడుటకు గాను మద్రాసు ప్రభుత్వ వస్తు ప్రదర్శనశాల కంపెదరు. అచ్చట పండితులు అవుసరము లగు శాసనముల పరీక్షించుకొన వచ్చును."

ప్రచురణ సంఘము.

---

సత్యమేవ జయతే

ధర్మసాధని

శనివారము, డిశంబరు, ౧౦, ౧౯౩౧.

# బుద్ధగయ.

'చరిత్రాదుల వలన బుద్ధుడు ఉత్తమ జ్ఞానము ఎచ్చట పొందినట్లు తెలియుచున్నదో ఆ స్థలము సర్వ మానవకోటికి పవిత్రమగునది. అది తమ గురువుని సేవించుటకు అన్ని ప్రాంతములనుండి వచ్చు భక్తి పూరిత యాత్రికులతో, అద్భుతముగ అనేక విధము లయిన భాషలలో వ్రాయబడి నేటికి సహితము నిల చియున్న ఆ మహనీయుని యుపదేశముల సంస్మరించు భిక్షువులతో, నిండి యుండునని ఆశగొని యుంటిని. విహారము లేదు. భిక్షువులు లేరు. యాత్రికులు లేరు. ఇట్టి యలక్ష్యము బౌద్ధ సాంప్రదాయకు లెల్లరకు అవమానకరము.' అని యిప్పుడు మన దేశములో నున్న ప్రాచ్య పండితుడు సిల్వాన్ లెవిగారు వ్రాయుచున్నారు.

సిల్వాన్ లెవిగారు ప్రాగ్దేశ ప్రాచీన గ్రంథముల పరిశోధనయందు జీవితము గడపుచున్నారు. వారిప్పుడు శ్రీ రవీంద్రుని విశ్వవిద్యాలయము, విశ్వ భారతికి వచ్చి యుండుపాధ్యాయ పదవి వహించిరి. విశ్వ భారతిలో చదువు విద్యార్థులకే గాక చుట్టుప్రక్కల నుండి వచ్చు విద్యార్థుల కొరకును వారుపన్యాసము లొసంగుట కేర్పాటులు చేయబడినవి. వారి కృషి మూలమున పూర్వచరిత్రలను గ్రంథములను గూర్చి యథార్థ జ్ఞానము మన దేశమున వ్యాపింప వచ్చునని నమ్మదగి యున్నది. ప్రాచీన సంస్థల విషయమున, పూర్వాపర జ్ఞానము పట్ల, మన దేశీయులకు గల యుదాసీనత సిల్వాన్ లెవిగారు బుద్ధగయను గూర్చి వ్రాసిన వాక్యముల వలన కొంతవరకు బోధపడ గలదు. గతము పునాది వంటిది. గతమును విడిచి యభివృద్ధి నొంద గోరువారు ఆకాశ హర్మ్యముల నిర్మించు వారే. పూర్వులు పడిన శ్రమను, చేసిన మేలును మరచి, అందులో మహా జ్ఞానియై లోక విఖ్యాతి గాంచిన బుద్ధుని సంస్మరణను గూడ వీడి యధోగతి జెంది యున్న భారతీయులకు సిల్వాన్ లెవి పండితుని మందలింపు కొంత యుపయోగకారి కాగలదని విశ్వసించుచున్నాము. సిల్వాన్ లెవి పండితుడు ఇరువది నాలుగు వత్సరముల క్రిందట బుద్ధగయను దర్శించిరి. నాడు తమ మనస్సునకు తట్టిన భావముల తెలుపుడని కోరబడుటచే వారిప్పుడీ యభిప్రాయముల వెల్లడించిరి. వారు బౌద్ధ సాంప్రదాయమునకు జెందిన యుపాసకుడు గాని భిక్షువుగాని కాదు. బౌద్ధ మతమునకు జెందిన వారును కాదు. ఆసియా ఖండములో చాల భాగమున వ్యాపించియున్న మతమునకు మూల పురుషుడై సర్వ మానవులు శిరసావహింప దగిన పరమ సత్యముల బోధించిన బుద్ధుని గురించి తెలిసికొనిన కొలది వారు అద్భుతపడి స్వదేశమున, స్వానుచరులచే బుద్ధునికి చూపబడు అలక్ష్యమును సహింపజాలక అట్లు వ్రాసిరి. ప్రాగ్దేశీయులు, భారతీయులు తిరిగి ప్రపంచమున తల యెత్తవలె నన్న ఆత్మశక్తి, ప్రేమ మహిమ కనబరచిన మహాత్ముల సేవించుట నేర్చుకొనవలెను.

బుద్ధుని గూర్చి అసలు తెలిసిన వారు లేకపోలేదు. బౌద్ధమతము అవలంబించు వారందరు కొద్దిగనో గొప్పగనో బుద్ధుని గూర్చి తెలిసిన వారే. ఆంగ్ల విద్య నేర్చిన విద్యాధికులందరు బుద్ధుని చారిత్రికాంశములు బాగుగ తెలిసిన వారే. బౌద్ధమతావలంబులని తలంచు వారిలో బౌద్ధ ధర్మము నామ మాత్రముగ నున్నది. విద్యాధికులలో బుద్ధుని గురించిన వట్టి సంగతులు మాత్రము వ్యాపించినవి. అర్థము తెలియని మాటలు, నిర్జీవములయిన సంగతులు సంస్మరణమునకు, సంసేవనకును నిదర్శనములు కావు. స్మరణ మూలమున హృదయము పరవశత్వము నొందవలెను. సేవనముచే సమస్త శక్తులు ధర్మ ప్రేరితములు కావలెను. బుద్ధుడు భరతవర్షమునగాని ఇతర ప్రాగ్దేశము లందు గాని యథార్థముగ పూజింపబడు చున్నాడా

లేదా యని తెలిసికొనుటకు, ఆ యూ దేశస్థుల హృదయములు, చర్యలు ఎట్లున్నవో దానిని బట్టియే నిశ్చయింప బడవలెను. బుద్ధుడు పూర్వము బోధించిన ధర్మమునే నేడు గాంధి మహాత్ముడు తిరిగి బోధించుచుండె. విద్యాధికులేమి, విద్యావిహీనులేమి దానిని గుర్తింపజాలక తెల్లబోవుచు ఆచరించుటకు సంశయించుచున్నారు; వెరచుచున్నారు. జీవనములో విరాజిల్లునదే ధర్మము. శుష్కతత్వమునే, బాహ్యాచారమునే, ధర్మమని మనము మోసపోరాదు. సిల్వాన్ లెవి పండితుడు కోరినట్లు మనము బుద్ధగయను పనిల పరచి యచ్చటికి యాత్రలు సలుపుచుండినంతనే మనము బౌద్ధధర్మము గ్రహించిన వారమగుచు మనుటకు నవలనుపడదు. ఆ పుస్తకముల ముఖమే చూడని పిల్లవానికి చదువునందు ఎంత శ్రద్ధ యుండునో మహాపురుషుల జన్మకు తెచ్చు పుణ్యక్షేత్రముల తలపోయని వారికి ధర్మమునందంతే శ్రద్ధ యుండునని మాత్రము చెప్పవలసి వచ్చును. వాస్తవముగా మనము ధర్మాభిలాషులమే యైనచో సిల్వాన్ లెవిగారు చెప్పినటుల ధర్మసాధనముల నన్నిటి యెడ సంపూర్ణ శ్రద్ధను వహించి వానిని సద్వినియోగము చేసికొనవలెను. బుద్ధుని తమ అవతార పురుషునిగ, బుద్ధగయ సహితము తమ పుణ్యక్షేత్రముగ గైకొనిన హిందువులు బౌద్ధ ధర్మావలంబులకే యని యొసంగబడిన హెచ్చరికను తమకు కూడ నని గ్రహించి తమ కర్తవ్యమును తప్పక నెరవేర్తురు గాక!

---

## పుస్సిఫుట్ గారి లేఖ.

—:o:—

అమెరికా దేశములో మద్యపాన నిర్మూలనముకై విశేషముగ పాటుపడి రాజకీయ శాసనము సహితము నేర్పరుప గలిగినట్టియు, ఇటీవల మన దేశమునకు వచ్చి అన్ని ముఖ్య పట్టణములలో తమ యనుభవములను ఉపన్యాసముల మూలమున వెల్లడించినట్టియు, పుస్సిఫుట్ జాన్సన్ గారు వ్రాసిన ఈ క్రింది లేఖ మహాత్మా గాంధి గారి యుద్యమము ఎంత ఫలప్రద మయ్యెనో చాటుచున్నది.

నా ప్రియ బంధు గాంధి గారికి—

మీరు దేశమును విడిచి ప్రయాణమై పోవునప్పుడు మద్యపానము తగ్గించు విషయమున మీరు హిందూ దేశమున గావించి నట్టి తన్మూలమున యావత్ప్రపంచమునకు చేసినట్టి యమూల్య కృషిని గూర్చి చింతించుటకు నా మనస్సు మరలుచున్నది.

ఏ యుద్దేశముతో, ఏ లక్ష్యముతో ఏ పద్ధతితో అది సలుపబడెనో వానిలో అనుచితములని తీసివేయ తగిన వన్నియు తీసివేసినను, మీరు రెండు సంవత్సరములలో మద్యపాన నిరసనమున కయి యున్నట్లెవ్వరును ప్రపంచమునందింత వరకు ఆ కాలములో చేసియుండని పని చేసితిరను విషయము కరతలామలకము.

ఈ యుత్తరమున మీకు తెలుపుచున్న సంగతిని మిక్కిలి స్వయముగ కలిసికొని తెలుపజాలనందులకు హిందూ దేశము విడుచు నీ తరి మిగుల విచారించుచున్నాను. ఇందుకై వచ్చిన భాగ్యము లభించిన యోగ్యురాలగు మీ సహధర్మచారిణికిని మీ సహోదరునకును నా ప్రీతి పూర్వక వందనముల నర్పింపుడు.

సముద్రమునందు ౧౯–౧౧–౩౧

మీ ప్రీతి భాజనుడు,
డబ్ల్యు. ఇ. జాన్సన్.

---

ఆదిమాంధ్రుల తీర్మానము:—

మొన్న గుంటూరులో జరిగిన తృతీయ ఆదిమాంధ్ర మహా సభలో చేయబడిన ఈ క్రింది తీర్మానమును మహాత్మా గాంధి గారి యనుచరులు ముఖ్యముగ గమనింతురు గాక! ఆదిమాంధ్రుల న్యాయముగ జూచుచు శాసనోల్లంఘనమునకు ఎవరును నుద్యుక్తులు కారాదని స్పష్టముగ మహాత్ముడు తెలిపెను. ఆతురత కొలది తమ విధి నిర్వర్తింపక శాసనోల్లంఘనమునకు పూనువారు ఉద్యమమునకు తప్పక ముప్పు తెచ్చెదరనుట నిశ్చయము.

"రాజకీయ శాసనోల్లంఘనమును ఆచరణలో పెట్టుటకు అర్హత గలుగుటకై అఖిల భారతసంఘము వారిచే నిర్దేశింపబడిన ధర్మములలో అస్పృశ్యత నివారణము అతి ప్రాముఖ్యమనియు, యీ సమస్త రాజకీయ రంగములో ప్రాముఖ్యత నొసంగి కార్యోన్ముఖమునకు దెచ్చినందుకు శ్రీ గాంధి మహాత్మునకు అందరు సవినయ కృతజ్ఞులుగా నుండవలెననియు ఏ ప్రాంతములో నయిన అస్పృశ్యతా పాప నివారణ పాటింపక శాసనోల్లంఘనమును ఆచరణలో బెట్టుటకు తీర్మానింపబడిన యెడల అట్టి దానిని ఆదిమాంధ్రులు నిరోధింప వలెననియు ఈ సభ వారు తీర్మానించుచున్నారు."

---

# మూడే మార్గములు.

౧

—:o:o:—

గీ॥ పౌరుష జ్ఞానకీర్తులు జరగనేని
వాని సంపద యొకపూట మైనచాలు
ఉదర పోషణార్థమై నుర్విమీద
గాకి చిరకాలమున్న నే కార్యమగును.

శ్లో॥ బ్రాహ్మణః క్షత్రియో వైశ్యస్త్రయోవర్ణాద్వి
జాతయః ! చతుర్థఏక జాతిస్తు శూద్రోనాస్తితు
పంచమః.

కావున ; ఓ ఆదిమాంధ్ర సోదరా !

## నీవు పౌరుషముతో జీవింప కోరుచున్నావా ?

అయితే నిన్ను బానిసునిగ తయారుచేసి అను గంట ద్రొక్కుచున్న పాలేరుతనము కూలి నాలి మాని మీ పెద్దల వలన గౌరవింపబడి నీకు కులవృత్తులయియున్న నేత, వ్యవసాయము, వడ్రము, కమ్మరము, కుమ్మరము, చెప్పులు కుట్టుట, బుట్ట లల్లుట, నేడె మొదలు పెట్టుము. యివి నిన్ను తరింప జేయుగలవు. నిశ్చయముగ నమ్మము—నీవు ఈ పనులు చేయుట క్లిష్టపడవేని పరమ బానిసునిగా పిలువ బడుదువు. గ్రహించుము.

## నీవు జ్ఞానవంతుడ వనిపించుకొనుట కిష్ట మున్నదా ?

అయితే శ్రద్ధతో వినుము. వేకువజామున నిద్రలేచి పరిశుద్ధుడవై యీశ్వరుని ధ్యానింపుము. అధర్మమని తోచిన పనిచేయకుము. యెన్ని కష్టములు వచ్చినను సత్యమునె చెప్పుము. అధవా రాత్రి పాఠశాలయందైన విద్య నేర్వుము. మురికిలేని బట్టలు ధరింపుము. శుభ్రమగు నీటిని త్రాగుము. మంచి యాహారము తినుము. సద్గ్రంధములు చదివి నీతి గ్రహించుము. నీకున్న దానిలో తృప్తిపడి చేయగలిగి నంత సహాయము పరులకు చేయుచుండుము. ఎల్లరు అన్నదమ్ములని భావించుము. దురభ్యాసములు మాని నీవు నివసించు యిల్లు పరిశుభ్రముగ నుంచుకొనుచు నుండుము. జ్ఞానివగుము—దిన దినము స్నానము చేయక గుడ్డలు కంపుగొట్టుచు యిండ్లచుట్టు పందికొట్లు, కోడి, కుక్కల యొక్క మలమూత్రముల తో నిండుకొని యెన్నాళ్లుందువో అన్ని దినములు నీవు ఛండాలుడవే, నమ్ముటికి ఛండాలుడవగుదువు.

## నీవు నిజమైన హిందువుడ వనిపించు కొనెదవా?

అయితే ఈ మాట గట్టిగా నమ్ముము. పవిత్రమగు హిందూ మతమందు గల ధర్మము గ్రహింపక మునుపే పరమతములో చేరకుము గాని సర్వమతాభిమానివై మెలగుము. “అహింస పరమోధర్మః” యను వాక్యమును స్మరించి హిందూమతములో మరెవరి చేతను భక్షింపబడనట్టి గోమాంసము పందిమాంసము తినక కల్లు సారాయిలు త్రాగి ఒల్లు యిల్లు గుల్ల చేసుకొనక ఈ మూడును మత దూష్యములయి మానవ నీతిని చెరచుచు వినుటకుగాని చూచుటకుగాని కడు హేయముయి వున్నవి కనుక మాంసాహారము మద్యపానము మహా పాతకములని నమ్మి తప్పక ఈ దినమే త్యజించి మరచిపొమ్ము. అంతట “నేనే నిజమయిన హిందువుడనని” సంతసిల్లుము—గోమాంసము తిని కల్లుత్రాగి ఒల్లు తెలియక తిరుగుచున్నంత కాలము నిన్నొక పులివలె, నక్కవలె, కుక్కవలె నీచముగా చూచి దూర దూరముగ బహిష్కరింతురను మాట మదిలో మరచిపోకుము—గోవు కామధేనువు అనగా నీ తల్లి. గోమాంస భక్షణ మహా దోషము—మద్యపానము గొప్ప విషము.

కుసుమ ధర్మన్న,
గుడివాడ. సేవాశ్రమము.

———

# బ్రాహ్మ సమాజము.

—:-:o:-:—

కాకినాడ బ్రాహ్మసమాజము.

౪-౧౨-౨౧ ఆదివారము సాయంకాలము సమాజ మందిరములో శ్రీయుత వి. పెదబరాజు బి. ఏ. గారు ఆచార్యులుగా యుండి బ్రహ్మోపాసన జరిగించిరి. సకాలమునకు స్నేహబృందము దయచేసి యుత్సాహ పూరితమైన భజన గావించిరి. ౧౧-౧౨-౨౧ ఆదివారము సాయంకాలము అయిదున్నర గంటలకు యధారీతిని యుపాసన జరుగును. సభ్యులు, అభిమానులు యావన్మంది సకాలమునకు విచ్చేయ ప్రార్థితులు. శ్రీయుత వింజమూరి లక్ష్మి నరసింహారావుగారు యుపాసన జరుపుదురు. ఉపాసన పూర్వము మౌల్వీ సయ్యదు అమీరు సాహెబుగారు కోరానునుండి కొంత గ్రంధము చదివి బోధించెదరు. విన గల నిచ్ఛగల సమాజాభిమానులు, సభ్యులు ముఖ్యముగా రా ప్రార్థితులు.

వాడ్రేవు రామమూర్తి.

———

**The Dharma Sadhani Press,**
COCANADA.

*All Kinds of Job work*
*in*
**English & Telugu**
*Promptly and Neatly*
*executed.*


## ధర్మసాధని.

ప్రకటన పద్ధతి.


| | 1 సం॥ | ½ సం॥ | ¼ సం॥ |
|---|---|---|---|
| 1 కాలము. | రు. 60 | రు. 40 | రు. 24 |
| ½ „ | „ 40 | „ 24 | „ 16 |
| ¼ „ | „ 24 | „ 16 | „ 12 |

ప్రకటన ద్రవ్యము ముందుగానె చెల్లింపవలెను.

## విజ్ఞప్తి.

ధర్మసాధనికి చందాదారులుగ నుండగలరని తమకు తోచిన వారి విలాసముల తెలుప ఁబత్రికాభిమానులు వేల్లరు ప్రార్థితులు.

ధ. సం.


## ఫౌంటెన్ కలము.

1. „బ్లాకు బర్డు" ఫౌంటెన్ పేనా, 12 ct బంగారు పాళీతో — రు. 3- 0-0
2. „హార్డు వేరు". „ 14 ct „ — 2- 8-0
3. „స్వాన్" „ 14 ct బంగారు పాళీతో కలది. ప్రశస్తమైనది — 5- 8-0
4. „వాటరుమెన్ ఐడియల్" ఫౌంటెన్ పేనా 14 క్యారట్ల బంగారు పాళీ కలది, మిక్కిలి నాణ్యము — 7- 0-0
5. „ప్రిమియరు" „ 14 ct బంగారు పాళీతో „ — 5- 8-0

కలములు వి. పి. గా పంపబడును. వ్రాయునపుడు, సన్నపుపాళీ కావలెనో, ముదురుపాళీ కావలెనో వ్రాయవలయును. మేము మంచి కలములను చక్కగా పరిశోధించి చూచిన పిమ్మటనే పార్సిలు ద్వారా పంపుదుము. కావున, దూరమునందున్నవారు నమ్మకము కలిగి బంగీలద్వారా వారికి కావలసిన కలములు తెప్పించుకొనవచ్చును. వలయువారు ఈక్రింది అడ్రెసుకు వ్రాసికోవలెను.

యమ్. హెచ్. రావు అండు సన్సు, కవలాపేట నెం 29, కాకినాడ.



# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

## పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

ఇండియన్ పెటల్ డెస్టు:—అతిమనోరమ్యమైన సుఖద్రవ్యపొట్లము, ఉడుపు పెట్టెలయందు పెట్టినయెడల, వస్త్రములకు చాలా పున్నతమైన సువాసన పరిమళించేది గాకుండా వండ్లు మొద లయిన పురుగుపుట్రలు గుడ్డలయందు చేరనీయకుండా కాచును. దీని ఇంపైన సుగంధము చాలా దినములు వుండును. పొట్లం 1 టికి వెల 4 అణాలు 1, మొదలు 12 పొట్లములవరకు పంపను వి. పి. ఖర్చు 8 అణాలు ప్రత్యేకము.

### కాటుక లేక — శిరా.

ప్రత్తి, కంబళి, పట్టు మొదలైన వస్త్రములను వుతికినాగాని లేక తెల్లబారినా గాని విలాసం యెంత కాలమైనా చెడదు. యిందుచేత బట్టలపై విలాసం వేసిన యెడల వుసుపులను దొంగతనం పోకుండానున్ను యొకటి కొకటి మారుపాటు లేకుండానున్ను చూచుకోవచ్చును.

వెల సీసా 1 కి అణాలు 8, వి. పి, ఖర్చులు 1 మొదలు 6 సీసాల వరకు అణాలు 8 ప్రత్యేకము.

### బొల్లికి మందు.

పైన పూయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. చార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధముల యొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

## సుందరమైన 1921 ఉపయోగమైన క్రొత్త క్యాలండరు

విక్రయమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0-4-0 వి. పి. ఖర్చులు సహా 0-6-0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0-6-0 | డబ్బి 1 కి, 0-2-0 | సీసా 1 కి, 0-12-0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బీతో సహా వెల రూ. ౦-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫోర్బిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదాసు.

## వైద్యరత్న పండిత డి. గోపాలాచార్యులుగారి

## అమృతామలక తైలము.

శిరస్సును కండ్లను సర్వదా కాపాడును. అన్నివిధ శిరోరోగములను బోగొట్టును. పార్శ్వనొప్పులను దూరము జేయును. కణతనొప్పులను నిర్మూలము జేయును. పీనసరోగముల రానివ్వదు. మెదడుకు బలము కలుగజేయును. కర్ణరోగములను నశింపజేయును. కండ్లకు చలువజేయును. అపస్మారముల దూరము జేయును. తలనరములకు బలము నిచ్చును. నేత్రరోగములకు హితము. మూర్ఛలను బోగొట్టును. తల చుండును బోనణచును. వెంట్రుకలను నెరయకుండ జేయును. వెంట్రుకలను పట్టుకుంచవలె పెంచును. నెరసిన వెంట్రుకలను నలుపుజేయును. యోచన జేయువారికి మిక్కిలి హితకరము. మాడుపోట్లను నిర్మూలము జేయును. విద్యార్థులకు సర్వదా హితము. చర్మరోగులకు మంచిజేయును. తల మంటలను మాన్పును. అధికనిద్రను తగ్గించును. నిద్రలేమిని బోగొట్టును. దీని గుణములు అనుభవజ్ఞులను తెలుసును.

వెల బుడ్డి 1-కి రు 1-0-0. ప్యాకింగు పోస్టేజి ప్రత్యేకము. క్యాటలాగు ఉచితము.

తంతి విలాసము. పండిత్ మదరాసు. | ఆయుర్వేదాశ్రమం, 41, ఆచార్పన్ వీధి, జి. టి. మదరాసు.


Reg. No. M. 1094.
The Dharma Sadhani, Cocanada.

Printed & Published at the Dharma Sadhani Press Cocanada, by the Editor, K. Hanumanta Rao.

To M. R. Ry. V. P. Rs.

16 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School

